సాక్షి
అనంతపురం
శనివారం, 5, ఏప్రిల్, 2025



చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26 వేలు ప్రకారం విక్రయాలు జరిగాయి.



లోకం మెచ్చిన ప్రజాకవి వేమన

లోకం మెచ్చిన ప్రజాకవిగా ఖ్యాతిగాంచిన యోగి వేమన ఉత్సవాలు ఈ నెల 6న గాండ్లపెంట మండలం కటారుపల్లిలో ప్రారంభం కానున్నాయి.

8లో

గరిష్టం/కనిష్టం
36.5°/21.1°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఉక్కపోత కొనసాగుతోంది. ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

విద్యార్థిపై అడవి పంది దాడి



అడవి పంది దాడిలో గాయపడిన చరణ్

కంబదూరు: పాఠశాలకు వెళ్తున్న ఓ విద్యార్థిపై అడవి పంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన శుక్రవారం కంబదూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక గుండ్లపల్లి కాలనీకి చెందిన బొమ్మలాట ఆంజినేయులు కుమారుడు చరణ్ కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా అడవి పంది అడ్డొచ్చింది. దీంతో చరణ్ కింద పడిపోయాడు. అతనిపై అడవి పంది దాడి చేయడంతో గట్టిగా కేకలు వేశాడు. చుట్టు పక్కల వారు కేకలు విని పరుగెత్తుకొచ్చి అడవి పందిని తరిమేశారు. తీవ్రంగా గాయపడిన చరణ్‌ను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

నేటి అర్ధరాత్రి నుంచి సమ్మె

అనంతపురం అర్బన్: శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు తమకు రావాల్సిన బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లించాలనే డిమాండ్‌తో శనివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారు. ఈ మేరకు శ్రీరామిరెడ్డి నీటి సరఫరా పథకం కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు జి.ఓబుళు, అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరుస్వామి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

చుక్కల భూముల ఫైళ్లు పక్కాగా ఉండాలి



డీఎల్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూముల సమస్యలు పరిష్కరించే క్రమంలో వాటి ఫైళ్లు సమగ్ర వివరాలు, ఆధారాలతో పక్కాగా ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో డీఎల్‌సీ (డాటెడ్ ల్యాండ్ కమిటీ) సమావేశం నిర్వహించారు. బుక్కరాయసముద్రం మండలం పరిధిలో 22ఏ జాబితాలో నాలుగు కేసులను విచారించి, రెండు కేసులను ఆమోదించారు. మిగిలిన రెండింటిని తిరస్కరించారు. కళ్యాణదుర్గం మండలానికి సంబంధించి రెండు కేసులను విచారణ చేసి, ఆమోదించారు. అనంతరం రాయదుర్గం మునిసిపాలిటీకి సంబంధించి డీఎల్ఎన్‌సీ (డిస్ట్రిక్ లెవల్ నెగోషియేషన్ కమిటీ) నిర్వహించి ఎకరాకు రూ.43 లక్షలు నిర్ణయించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, తహసీల్దార్లు భాస్కర్, పుణ్యవతి, మహబూబ్‌బాషా, నాగరాజు, కలెక్టరేట్ భూ విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, డీటీ ప్రభంజన్‌రెడ్డి, రాయదుర్గం మునిసిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటైన సచివాలయాలు పారదర్శక సేవలతో ప్రజల అభిమానం చూరగొన్నాయి. సిఫార్సులు లేకుండా.. సంతకాల కోసం ఎదురుచూపులు లేకుండా.. దరఖాస్తు చేస్తే చాలు అర్హతలను బట్టి పథకాలు, ధ్రువపత్రాలు, వివిధ రకాల సేవలు నిర్దిష్ట గడువులోపు అందేవి. అలాంటి వ్యవస్థను కూటమి సర్కారు నిర్వీర్యం చేసింది. ప్రజలకు మళ్లీ పాత కష్టాలను తీసుకొచ్చింది.



సేవలకు విఘాతం

సచివాలయ సేవలకు తిలోదకాలు

- ఇంటివద్దకే వచ్చి ఇచ్చే పింఛన్లకు ఎగనామం
- రేషన్ డోర్ డెలివరీ నిలిపివేతతో వృద్ధులకు కష్టాలు
- ఇంటింటా చెత్త సేకరించే వాహనాలూ ఆపిన సర్కారు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గడిచిన ఐదేళ్లలో ప్రజలు కోరుకున్న సేవలన్నీ ఇంటి ముంగిటకే వచ్చాయి. గ్రామ/ వార్డు సచివాలయ వ్యవస్థ కారణంగా పింఛన్లు మొదలుకొని అన్ని సేవలూ సత్వరమే అందాయి. కరోనా లాంటి ఆపత్కాలంలోనూ ఈ సేవలే గట్టెక్కించాయని స్వయానా నీతి ఆయోగ్ చెప్పింది. అలాంటి ఈ వ్యవస్థను కూటమి సర్కారు బలితీసుకుంది. ఎన్నికలకు ముందు 'సంపద సృష్టిస్తా.. మహిళలను లక్షాధికారులను చేస్తా' అంటూ అలివికాని హామీలు ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు వాటిని గాలికొదిలేయడమే కాకుండా గడప ముందుకొచ్చే సేవలన్నిటినీ నిలిపివేశారు. పంచాయతీ కార్యాలయాల్లో పింఛన్ కోసం పడిగాపులు కాసే పరిస్థితులకు అద్దం పట్టేలా మళ్లీ పాతరోజులు గుర్తుకొస్తున్నాయని జనం అంటున్నారు.

వ్యవస్థ నిర్వీర్యం

ప్రతి 2 వేల జనాభాకు గ్రామ లేదా వార్డు సచివాలయం ఉండేది. బర్త్ సర్టిఫికెట్ మొదలుకొని పింఛన్ వరకూ అన్నీ ఇచ్చేవారు. ఇప్పుడు ఉద్యోగులను వివిధ విభాగాలకు బదిలీ చేసి గ్రామ/ వార్డు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. గతంలో రోజూ వేలాదిమంది లబ్ధిదారులు సచివాలయాలకు వచ్చి తమ పనులు చేసుకునే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

జిల్లా సమాచారం

గ్రామ/వార్డు సచివాలయాలు	432
రేషన్ కార్డులు	6,60,330
రేషన్ ఇచ్చే వాహనాలు	402
పింఛన్‌దారులు	2,81,588
చెత్త సేకరించే క్లాప్ ఆటోలు	120

రేషన్ కోసం పడిగాపులు



ఇంటి వద్దకే రేషన్ సరుకులు ఇవ్వడంతో గత ఐదేళ్లలో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా సంతోషంగా ఉండేవారు. కూటమి సర్కారు వచ్చాక ఇంటివద్దకే రేషన్ విధానాన్ని ఎత్తేశారు. ఇప్పుడు డీలర్ల వద్ద పడిగాపులు కాసి బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. గంటల తరబడి రేషన్‌షాపుల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇంటి నుంచి కదిలితేనే పింఛన్



వైఎస్ జగన్ హయాంలో ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి ఒకటో తేదీ తెల్లవారుజామున 5 గంటలకే ఇంటివద్దకే వెళ్లి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఏ వీధిలోనో, గ్రామంలోనో ఎక్కడో ఒకచోట ఇస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్లను తొలగించడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది.

మున్సిపాలిటీలు.. మురికి కూపాలు



గతంలో ప్రతి మున్సిపాలిటీ పరిధిలోనూ ఇంటివద్దకే వచ్చి చెత్త సేకరించేవారు. దీనికోసం 'క్లాప్' ఆటోలను పెట్టి తరలించేవారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక క్లాప్ ఆటోలను మొత్తం తొలగించారు. ఇప్పుడు ఎక్కడి చెత్త అక్కడే ఉంది. మున్సిపాలిటీలన్నీ మురికి కూపాలుగా మారిపోయాయి. పట్టించుకునే నాథుడే లేరు.

చెత్త సేకరించే వాళ్లు రావడం లేదు



ఇది వరకు మున్సిపాలిటీ వారు ఇంటి వద్దకు వచ్చి మైకులో చెత్త వేయాలని చెప్పేవారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా తీసుకుని వెళ్లేవారు. ఏడాది కాలంగా ఎవ్వరూ చెత్త కోసం రావడం లేదు. ఇంటి ముందే చెత్త వేసుకుంటున్నాం. రాత్రి సమయాల్లో దోమలబెడద అధికంగా ఉంటోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– రామకృష్ణ, వృద్ధుడు, ఒంటిమిద్ది, కళ్యాణదుర్గం

రెండు నెలలుగా రేషన్ అందలేదు



నాకు రెండు నెలలుగా రేషన్ బియ్యం వేయలేదు. డీలరును అడిగితే వేలిముద్రలు పడలేదు.. ఈ–కేవైసీ చేయించుకోవాలని చెప్పాడు. ఎక్కడకు పోవాలో తెలియదు. గతంలో ఇంటి వద్దకే రేషన్ బండి వచ్చి ప్రతి నెలా బియ్యం వేసేవారు. ఇప్పుడు రేషన్ షాపుకు వెళ్లినా బియ్యం వేసే పరిస్థితి లేదు. ఇలా అయితే మాలాంటి పేదలు ఏం తిని బతకాలి?

– మరియమ్మ, ఎస్.కోనాపురం, బ్రహ్మసముద్రం మండలం

చెత్త ఎక్కడ వేయాలో..?



రోడ్లపై చెత్త వేయరాదని అధికారులు చెబుతున్నారు. చెత్త తీసుకుని వెళ్లే వాహనాలు మాత్రం రావడం లేదు. ఎన్ని రోజులని ఇంటిలోనే చెత్త పెట్టుకోవాలి. గతంలో మాదిరిగా ప్రతిరోజూ ఇంటింటి చెత్తను తీసుకెళ్లేందుకు నగరపాలక సంస్థ అధికారులు వాహనాలను పంపిస్తే బాగుంటుంది. లేకుంటే ఇంటిలో చెత్త నిల్వలు పేరుకుపోయి కంపు కొట్టే పరిస్థితులు తలెత్తుతాయి. రోగాలు ప్రబలే ప్రమాదమూ లేకపోలేదు.

– రోజా, గృహిణి, అనంతపురం

జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం

- సెర్ప్ సీఈఓ కరుణ, కలెక్టర్ వినోద్‌కుమార్
- ఫ్లిప్‌కార్ట్, సెర్ప్ ఆధ్వర్యంలో అనంతపురంలో తొలి వర్క్‌షాప్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్రైం: మహిళల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యమని సెర్ప్ సీఈఓ కరుణ వాకటి, కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో విలువ ఆధారిత మార్కెటింగ్ (వాల్యూ చేంజ్ డెవలప్మెంట్ అండ్ మార్కెటింగ్ ఇంటర్వెన్షన్)పై అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి తొలి వర్క్‌షాప్ ఫ్లిప్‌కార్ట్– సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి సెర్ప్ సీఈఓ కరుణ వాకటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సెర్ప్ సీఈఓ, కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా ఫ్లిప్‌కార్ట్, సెర్ప్ ఆధ్వర్యంలో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. కందులు, వేరుశనగ, బియ్యం, చిరుధాన్యాలు, తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పీడీలు, డీపీఎంలు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. రైతులు పండించే పంటలలో నాణ్యత చాలా ముఖ్యమన్నారు. మార్కెట్‌తో అనుసంధానించిన ఉత్పత్తిదారుల సమూహాలను స్థాపించడానికి అట్టడుగు వ్యవసాయ వర్గాల నుంచి గ్రామీణ మహిళల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఫ్లిప్‌కార్ట్ కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల తలసరి ఆదాయం పెంచే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. దళారుల బెడద లేకుండా ఎక్కువ ధర లభించేలా చూస్తామన్నారు. మైక్రో ఇరిగేషన్, ఉద్యాన రంగంలో అనంతపురం జిల్లా రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా ఉందన్నారు. ఈ అంశంలో రైతులకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయి సహకారం అందించాలని, తగు సూచనలు, సలహాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ ఎగ్జిక్యూటివ్ బి.శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీఆర్‌డీఏ పీడీ బి.ఈశ్వరయ్య, ఇతర జిల్లాల పీడీలు నరసయ్య, ఆనంద్ నాయక్, శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, ఫ్లిప్‌కార్ట్ గ్రాసరి మేనేజర్ గిరిబాబు, సెర్ప్ అదనపు డైరెక్టర్ సరళ, అదనపు డైరెక్టర్ మహిత, డీఆర్డీఏ–వెలుగు డీపీఎం బి.గంగాధర్, జిల్లా సమాఖ్య సెక్రటరీ, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

సహనానికి ఫిట్‌నెస్ పరీక్ష

- రెండురోజులుగా పనిచేయని సర్వర్
- జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వాహనాలు
- ఏటీఎస్ వద్దే రోజంతా తప్పని పడిగాపులు





ఫిట్‌నెస్ కోసం ఏటీఎస్ కేంద్రానికి వచ్చిన వాహనాలు, పడిగాపులు కాస్తున్న వాహనదారులు

అనంతపురం సెంట్రల్: ఫిట్‌నెస్ టెస్ట్ ప్రక్రియ వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తోంది. సాఫ్ట్‌వేర్‌ల అప్‌డేట్ నేపథ్యంలో సర్వర్లు తరచూ మొరాయిస్తుండడంతో వాహనదారులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. గత కొన్ని నెలలుగా అనంతపురం శివారులోని ప్రసన్నాయపల్లి జాతీయరహదారి వద్ద శివ శంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) నిర్వహిస్తున్నారు. గతంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాలకు ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహించేవారు. జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయాల్లో కూడా ఈ పరీక్షలు జరిగేవి. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రతి జిల్లాలోనూ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో శివ శంకర్ ఎంటర్ ప్రైజెస్ టెండర్ దక్కించుకుంది.

సతాయిస్తున్న సర్వర్

వాహనాల ఫిట్‌నెస్ కోసం వందలాది వాహనాలు జిల్లా నలుమూలల నుంచి ఏటీఎస్ కేంద్రానికి వచ్చాయి. అయితే గత కొన్ని రోజులుగా సర్వర్ సరిగా పనిచేయడం లేదు. కొత్తగా ఆటోమేటిక్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ (ఏఎస్ఎంఎస్) సాఫ్ట్‌వేర్ తీసుకొస్తుండడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. అయితే వాహనదారులకు సరైన సమాచారం లేకపోవడంతో ఏటీఎస్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. సదరు కేంద్రంలో సరైన సదుపాయాలు లేకపోవడం వలన వాహన యజమానులు, డ్రైవర్లు చెట్లకిందే సేద తీరుతున్నారు. ఫిట్‌నెస్ టెస్ట్‌కు స్లాట్ బుక్‌చేసుకున్న వారికి సమాచారమైనా ఇస్తే ఈ విధమైన పరిస్థితులు వచ్చేవి కావని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇబ్బందులు రాకుండా చర్యలు

దేశ వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి సర్వర్ సమస్య తలెత్తింది. ఏఎస్ఎంఎస్ సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నారు. శనివారంతో ఈ సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. సర్వర్ సమస్యను వాహనదారులకు తెలియజేస్తున్నాం. దీనివల్ల ఎక్కువమంది రావడం లేదు. దూరప్రాంతాల నుంచి కొంతమందే వచ్చారు. వాహనదారులకు ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

– నాగార్జునరెడ్డి, ఏటీఎస్ నిర్వాహకుడు



శివ శంకర్ ఏటీఎస్ కేంద్రం

వర్ష బీభత్సం

- అకాల వర్షాలకు అపార నష్టం
- 30 మండలాల్లో 19.3 మి.మీ సగటు వర్షపాతం
- దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, అరటి, కాకర తదితర పంటలు

అనంతపురం అగ్రికల్చర్: అకాల వర్షాలు అతలాకుతలం చేశాయి. వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా గురువారం సాయంత్రం నుంచి రాత్రంతా జడివాన కురిసింది. 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలులకు తోడు భారీ ఉరుములు, మెరుపులు బెంబేలెత్తించాయి. శింగనమల మండలంలో 70.4 మి.మీ భారీ వర్షం కురిసింది. రాయదుర్గం మినహా మిగతా 30 మండలాల పరిధిలో 19.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది.

రూ.2.25 కోట్ల పంటనష్టం

ఈదురుగాలుల దెబ్బకు 175 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రైతులకు రూ.2.25 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ప్రాథమిక నివేదిక తయారు చేశారు. అనంతపురం, ఆత్మకూరు, కంబదూరు, శింగనమల, పెద్దవడుగూరు, కూడేరు, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి, యల్లనూరు, గార్లదిన్నె మండలాల పరిధిలో 40 హెక్టార్లలో అరటి, కళింగర, కర్బూజా, కాకర, బీర, చీనీ, మామిడి పంటలు దెబ్బతినడంతో రూ.1.25 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. అలాగే శెట్టూరు, అనంతపురం, నార్పల మండలాల్లో 115 హెక్టార్లలో వరి, మొక్క జొన్న దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

వర్షసూచన

రాగల మూడు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. శనివారం 5 మి.మీ, ఆదివారం 3 మి.మీ, సగటు వర్షపాతం నమోదు కావచ్చన్నారు. ఆదివారం అక్కడక్కడ వర్షం పడవచ్చన్నారు.



శింగనమల మండలం చిన్నజలాలపురం వద్ద రాలిపోయిన మామిడికాయలు



పెద్దపప్పూరు మండలం అమ్మళ్లదిన్నెలో నేలవాలిన అరటి



శింగనమల మండలం జూలకాల్వలో నేలకొరిగిన వరి పంట

టీచర్ల తాత్కాలిక సీనియార్టీ జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్జీటీ సమాన కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల కోసం సబ్జెక్టుల వారీగా 'టిస్' ఆధారంగా తాత్కాలిక సీనియార్టీ జాబితాలు సిద్ధం చేశారు. ఈ జాబితాలను డీఈఓ కార్యాలయ నోటీస్ బోర్డుతో పాటు www.deoatp blogspotలో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. జాబితాలను పరిశీలించి.. అభ్యంతరాలుంటే ఈ నెల 7 నుంచి 12వ తేదీలోపు సరైన ఆధారాలతో డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అభ్యంతరం వ్యక్తం చేసిన ఉపాధ్యాయుడి పూర్తిపేరు, వివరాలు, జాబితాలో తప్పిదం ఎక్కడుందో స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా మాత్రమే అభ్యంతరాలు తెలియజేయాలని స్పష్టం చేశారు.

అసైన్డ్ భూముల అక్రమాలపై చర్యలు

- ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, మరికొందరికి నోటీసులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలంలో కోట్లాది రూపాయల విలువ చేసే అసైన్డ్ భూములు ఆక్రమించిన వారిపై రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇటుకలపల్లి రెవెన్యూ పొలంలో శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ అసైన్డ్ భూములను ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించిన అధికారులు.. ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఆయనతో పాటు శివశంకర్‌రెడ్డి, మరికొందరికి నోటీసులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) చట్టం, 1977 ప్రకారం, అసైన్డ్ భూముల విక్రయం లేదా కొనుగోలు చట్టవిరుద్ధమని, అలా చేయడం అనుమతించబడదని నోటీసుల్లో స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేశారు. గడువు ముగిసిన తర్వాత, సదరు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు, ఇతర కార్యకలాపాలను తొలగించి చట్టపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, భూకబ్జాలు చేసే వారిని, మధ్యవర్తులను, అసైన్డ్ భూములను అక్రమంగా విక్రయించే వారిని ఎవరినీ ఉపేక్షించబోమని జిల్లా రెవెన్యూ అధికారి మలోల స్పష్టం చేశారు.

క్లుప్తంగా

అనంత కోర్టుకు బోరుగడ్డ అనిల్

అనంతపురం: సీఐని ఫోన్‌లో బెదిరించాడనే అభియోగంపై బోరుగడ్డ అనిల్‌ను జిల్లా న్యాయస్థానంలో శుక్రవారం పోలీసులు హాజరుపరిచారు. వివరాలు.. స్థానిక రామచంద్రనగర్‌లో ఉన్న చర్చికి సంబంధించి 2018లో హుండీ లెక్కింపు అంశంలో అభిప్రాయబేధాలు తలెత్తడంతో ఇరు వర్గాలకు చెందిన వారు అప్పట్లో అనంతపురం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంలో అదే ఏడాది జులై 22న అప్పటి త్రీటౌన్ సీఐ మురళీకృష్ణకు బోరుగడ్డ అనిల్ ఫోన్ చేసి బెదిరించాడనే అభియోగంతో కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు అప్పట్లో రిమాండ్‌కు తరలించారు. అనంతరం ఇతర కేసుల్లో చిక్కుకున్న ఆయన రాజమండ్రి జైలులో రిమాండ్‌లో ఉండడంతో ఈ కేసులో వాయిదాలకు హాజరు కాలేకపోయారు. దీంతో న్యాయస్థానం జారీ చేసిన పీటీ వారెంట్‌తో శుక్రజువారం అనంతపురం కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును ఈ నెల 10కి వాయిదా వేయడంతో తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.

సీఐకి మందలింపు

వాయిదా నిమిత్తం ఎక్సైజ్ కోర్టులో పోలీసులు హాజరుపరిచిన సందర్భంలో జడ్జి అనుమతితో కోర్టు హాలులో కూర్చొని తన న్యాయవాదితో బోరుగడ్డ అనిల్ మాట్లాడుతుండగా, నాల్గో పట్టణ పీఎస్ సీఐ కె.సాయినాథ్ వెళ్లి పక్కనే కూర్చొన్నారు. దీంతో ఈ అంశాన్ని జడ్జి దృష్టికి న్యాయవాది తీసుకెళ్లారు. కేసుకు సంబంధించి న్యాయవాదితో మాట్లాడేటప్పుడు అక్కడ ఉండాల్సిన అవసరం లేదంటూ సీఐని న్యాయమూర్తి మందలించారు. సీఐ నచ్చచెప్పబోతే.. న్యాయవాదితో మాట్లాడే హక్కు నిందితుడికి ఉందని అనడంతో ఆయన పక్కకు వైదొలిగారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

తాడిపత్రి టౌన్: మనస్తాపంతో ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... తాడిపత్రిలోని అంబాభవానీ కాలనీలో నివాసముంటున్న రంగయ్య, అమరావతి దంపతుల కుమారుడు హర్షిత్‌సాయి(17) విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈ క్రమంలో పరీక్షలు ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన విద్యార్థి.. ద్వితీయ సంవత్సం తరగతులు ప్రారంభం కావడంతో తల్లిదండ్రుల బలవంతంపై ఈ నెల 2న విజయవాడకు వెళ్లి, 3వ తేదీ ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో సెలవుల్లో ఇంటి పట్టున ఉండేందుకు వీలులేకుండా తనను కళాశాలకు పంపుతారనే మనోవేదనకు లోనైన హర్షిత్‌సాయి శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లోకం మెచ్చిన.. ప్రజాకవి వేమన

రేపటి నుంచి 4 రోజుల పాటు యోగి వేమన ఉత్సవాలు

సమాజంలోని అసమానతలను, బాల్య వివాహాలను రూపు మాపేందుకు స్త్రీ విద్యను ప్రోత్సహించిన సంఘ సంస్కర్తగా.. ప్రజల్లో పాతుకుపోయిన మూఢ నమ్మకాలను తనదైన సాహిత్యంతో పారదోలిన అభ్యుదయ కవిగా ప్రజల హృదయాల్లో యోగి వేమన చిరస్థాయిగా నిలిచిపోయారు. పామరుల నోట సైతం అలవోకగా జాలువారేలా అర్థవంతమైన కవిత్వంతో ఆకట్టుకున్నారు. నాడు సమాజంలో నెలకొన్న సమస్యలను అనేక కోణాల్లో దర్శించి లోటుపాట్లపై, దోపిడీలపై వ్యంగ్యాస్త్రాలను సంధిస్తూ 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో వేమన రాసిన పద్యాలు తెలుగు వారికి సుపరిచితాలు. ఆడంబరంలేని అందమైన తెలుగు భాషకు చిరునామాగా మారి లోకం మెచ్చిన ప్రజాకవిగా ఖ్యాతిగాంచిన యోగి వేమన ఉత్సవాలు ఈ నెల 6 నుంచి నాలుగు రోజుల పాటు కటారుపల్లిలో నిర్వహించనున్న నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.





వేమన ఆలయ ప్రవేశ ప్రధాన ద్వారం



వేమన సమాధి

గాండ్లపెంట: వేమన చరిత్ర కదిపితే ఎన్నో కథలు అలలు అలలుగా పలకరిస్తాయి. ఆయన కులంపై ఎన్నో వాదనలు ఉన్నా.. ఎన్నిసార్లు చరిత్రను తిరగేసినా వేమన 'రెడ్డి' కులస్తుడనే స్పష్టమైంది. ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన బ్రిటిష్ అధికారి సీపీ బ్రౌన్ ద్వారా 1839లో వేమన పద్యాలు తొలిసారిగా పుస్తక రూపంలో వెలుగులోకి వచ్చాయి.

ప్రజాచైతన్య బావుటా

సామాజిక వైజ్ఞానిక నేత్రాలతో సమాజాన్ని దర్శించిన వేమన... కుట్రలను, కుతంత్రాలను రూపుమాపడానికి తనదైన సాహిత్యంతో ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన సంధించిన వ్యంగ్యాస్త్రాలు ఎప్పటికీ నిత్యనూతనంగానే నిలిచాయి. ఇందులో మచ్చుకు కొన్ని...

వేషభాష లెరిగి కాషయవస్త్రముల్
గట్టగానె ముక్తి గలుగబోదు
తలలు బోడులైన తలపులూ బోడులా
విశ్వదాభిరామ వినురవేమ!

అర్థం: 'వేషభాషలు నేర్చుకుని, కాషాయ వస్త్రములు ధరించినంత మాత్రాన మోక్షము రాదు, గుండు గీయించుకున్నమాత్రాన దురాలోచనలు దూరం కావు' అంటూ అలాంటి వ్యక్తుల వైఖరిపై వేమన వ్యంగ్యాస్త్రం సంధించారు.

- మరో పద్యంలో వ్యక్తుల ఎదుట ఒకరీతిన... మనసులో మరోరీతిన వ్యవహరించేవారి వైఖరిని ఎండగడుతూ..

మాటలాడు నొకటి మనసులోన నొకటి
ఒడలి గుణము వేరె యోచన వేరె
ఎట్లుగల్గు ముక్తి యీలగు తానుండ
విశ్వదాభిరామ వినురవేమ!

అర్థం: 'మనస్సులో ఒకటి ఉంచుకునే పైకి మరోలా మాట్లాడే వ్యక్తి గుణమొకటి... యోచన వేరొకటిగా ఉంటుంది. ఇట్టి వారికి మోక్షము ఎట్లా కలుగుతుంది' అని ప్రశ్నించారు.

ఉత్సవాలు ఇలా...

- ఆదివారం నుంచి 4 రోజుల పాటు గాండ్లపెంట మండలం కటారుపల్లిలో విశ్వకవి యోగివేమన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం మహాశక్తిపూజ (కుంభం పోయుట), మధ్యాహ్నం నుంచి రాత్రి 1 గంట వరకు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయి.
- సోమవారం రాత్రి బండ్లు తిరుగుట, పానక పన్నేరం, రాత్రి 9 గంటలకు పాటల కచేరీ (ఆర్కెస్ట్రా) ఉంటుంది.
- మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఉట్ల తిరునాల, రాత్రి 9 గంటలకు అగ్ని సేవ ఉంటాయి. అలాగే సాయంకాలం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఉంటాయి.
- బుధవారం రాత్రి 9 గంటలకు గొడుగుల మేరవణితో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రత్యేక ఏర్పాట్లు..

ఉత్సవాలకు కదిరి పరిసర మండలాల నుంచే కాక ఉమ్మడి కర్నూలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే కదిరి నుంచి వచ్చే భక్తులు గాండ్లపెంట, రాయచోటికి వెళ్లే బస్సులు ఎక్కి కటారుపల్లి క్రాస్‌లో దిగి ఆటో లేదా నడక మార్గంలో కిలోమీటరు దూరం వెళ్లాల్సి ఉంటుంది. రాయచోటి నుంచి వచ్చే భక్తులు గాండ్లపెంట మీదుగా 4 కిలోమీటర్లు దూరంలో ఉన్న కటారుపల్లి క్రాస్‌కు చేరుకోవచ్చు.

పందుల అపహరణ కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

బెళుగుప్ప: గ్రామాల్లో రెక్కీ నిర్వహించి పందులను అపహరించుకెళుతున్న దొంగల ముఠా సభ్యుల్లో ప్రధాన నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఎస్‌ఐ శివ తెలిపిన మేరకు... ఈ ఏడాది జనవరి 5న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పందులను అపహరించుకుని వెళ్తున్నారంటూ బెళుగుప్పకు చెందిన రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో కొన్ని రోజుల క్రితం ఎరికల నాగరాజు, ఎరికల ముత్యాలప్పను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, అనంతపురానికి చెందిన సాకే ఆదినారాయణ అలియాస్ గుడ్డి ఆదినారాయణను శుక్రవారం కాలువపల్లి సమీపంలోని మానిరేవు క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.40 వేలు నగదు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాలపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారుల దందాపై కలెక్టర్ వినోద్ కుమార్ ఆరా తీశారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఓ ధర నిర్ణయించి దళారులు సాగిస్తున్న దోపిడీపై 'దళారుల మాటే చెల్లుబాటు' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులతో ఆరా తీసినట్లు సమాచారం. ఈ క్రమంలో జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏ చిన్న అవినీతి జరిగినా ఉపేక్షించబోమన్నారు. రాయదుర్గంలో దళారుల దందాపై విచారణ జరిపిస్తామన్నారు.

పీడీ పోస్టుల రద్దు అమానుషం

ఖండించిన ఏపీఎస్‌ఏపీఈఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులను రద్దు చేయడం అమానుషమని ఆంధ్ర ప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఏపీఎస్‌ఏపీఈఏ) నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.కేశవమూర్తి, కె.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నరసింహారెడ్డి, సునీత, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు శుక్రవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. స్కూళ్లతో పాటు జూనియర్ కళాశాలల్లో విద్య పరంగా పెనుమార్పులు తెస్తామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం... నేడు నిర్వీర్యం చేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులు రద్దు చేస్తూ వారిని ఇతర సబ్జెక్టులకు మార్పు చేస్తూ ఉత్తర్వులివ్వడం ద్వారా విద్యార్థులకు క్రీడావిద్యను దూరం చేసినట్లువుతుందన్నారు. కరోనా తర్వాత విద్యార్థులు సెల్‌ఫోన్లకు అలవాటుపడి ఇప్పుడిప్పుడే క్రీడలవైపు మొగ్గుచూపుతున్నారని, ఇలాంటి తరుణంలో ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి గొడ్డలిపెట్టులా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో 199 పీడీ పోస్టులు రద్దు చేయడం అన్యాయం అన్నారు. ఇప్పటికే 19 ఏళ్లలోపు ఇంటర్ మీడియట్ క్రీడాకారులు పీడీలు లేక తీవ్ర ఒత్తిడికి లోనవుతూ స్కూల్ గేమ్స్ టోర్నమెంట్‌లో ఆడలేకపోతున్నారన్నారు. ఈ కన్వర్షన్‌ను ఆపకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటించి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడతామని హెచ్చరించారు.

స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లపై నిర్లక్ష్యం వద్దు

- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి

అనంతపురం టౌన్: స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లపై నిర్లక్ష్యం వహించకుండా వినియోగదారులు బుక్ చేసుకున్న సమయంలోనే వారికి రిజిస్ట్రేషన్ సేవలు అందించాలని సబ్ రిజిస్ట్రార్లను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌తో కలసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్లాట్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. తొలిరోజు రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 33 మంది స్థిరాస్తి క్రయ, విక్రయదారులు ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవడంతో వారందరికీ సకాలంలో రిజిస్ట్రేషన్ సేవలను అందించారు. అనంతరం డీఐజీ విజయలక్ష్మి మాట్లాడుతూ... వివిధ సేవల కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే వినియోగదారులకు సకాలంలో పనులు పూర్తి చేయడం ద్వారా రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై వారికి నమ్మకం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్లు రమణరావు, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌లో 44 మందికి ఎస్‌ఐలుగా అడ్‌హాక్ పదోన్నతి

కర్నూలు : ఎక్సైజ్ శాఖ ఫోర్త్ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఎస్‌ఐ పోస్టులను భర్తీ చేస్తూ ఆ శాఖ నోడల్ అధికారి (డిప్యూటీ కమిషనర్) శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న 29 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 15 మంది క్లర్కులకు అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతి కల్పించి బదిలీల్లో భాగంగా వారికి స్టేషన్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ మహిళా ఎస్‌ఐలకు సంబంధించి మరో నాలుగు పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. వీరి సీనియారిటీ జాబితా త్వరలోనే రూపొందించి ఆయా పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. పదోన్నతి పొందిన వారందరికీ శుక్రవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ప్రమోషన్‌తో పాటు పోస్టింగ్ కాపీలను డీసీ శ్రీదేవి అందజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పదోన్నతి దక్కిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని డీపీఈఓలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ రవితేజ ఉన్నారు. ఆయనకు కర్నూలు ఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు.



ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారితో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఈఎస్ సుధీర్‌బాబు

నిలకడగా ఎండు మిర్చి ధరలు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 90 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా, ఈ–నామ్ ద్వారా వేలం పాటలు నిర్వహించారు. క్వింటా గరిష్ట ధర రూ.15వేలు, కనిష్ట ధర రూ.70వేలు చొప్పున సగటున రూ.13,500 ధరతో క్రయ విక్రయాలు సాగాయి. ఈ మేరకు మార్కెట్ యార్డ్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.



మార్కెట్‌లో ఎండు మిర్చి విక్రయాలు





పీఏబీఆర్‌లో నీట మునిగి యువకుడి మృతి

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల గ్రామానికి చెందిన కత్రిమల కార్తీక్ (25) ప్రమాదవశాత్తు పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) నీట మునిగి మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... కార్తీక్‌కు ఆరు నెలల క్రితం బళ్లారి జిల్లా కుడితిని గ్రామానికి చెందిన అఖిల అలియాస్ లక్ష్మితో వివాహమైంది. ఈ క్రమంలో బళ్లారికి మకాం మార్చి కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉగాది పండుగ సందర్భంగా ఇటీవల స్వగ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. పీఏబీఆర్ సమీపంలో ఉన్న బంధువుల పంట పొలాలకు నీరు పెట్టేందుకు జలాశయంలో మోటారు దింపాల్సి ఉండడంతో వారితో కలసి గురువారం రాత్రి 9 గంటలకు జలాశయం వద్దకు వెళ్లాడు. మోటారును నీటిలో దించే క్రమంలో జలాశయం లోపలికి వెళ్లిన కార్తీక్.. కాలు చేపల వలకు చిక్కుకుంది. వల నుంచి కాలును విడిపించుకునే క్రమంలో ఊపిరి ఆడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం అక్కడకు చేరుకుని కార్తీక్ మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, పెళ్లైన ఆరు నెలలకే భర్తను కోల్పోయిన అఖిలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

యూనిట్లు గ్రౌండింగ్ కావాలి : కలెక్టర్

అనంతపురం అర్బన్: బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా మంజూరైన యూనిట్లు సకాలంలో గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. యూనిట్ల గ్రౌండింగ్ అంశంపై శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ నెల 11న జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా యూనిట్ల గ్రౌండింగ్ చేయాలన్నారు. జిల్లాకు 1,728 యూనిట్లు కేటాయించగా ఇప్పటి వరకు 1,571 యూనిట్లు బ్యాంకులకు పంపించారన్నారు. మిగిలిన యూనిట్లను ఎంపీడీఓలు, కమిషనర్లతో సమన్వయం చేసుకుని బ్యాంకులకు పంపించాలని బీసీ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు రెండు ఖాతాలను ఈ నెల 7వ తేదీలోగా బ్యాంక్ మేనేజర్లు తెరిచేలా చూడాలన్నారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

జిల్లా మినరల్ ఫండ్స్‌కు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. జిల్లా మినరల్ ఫండ్స్‌కు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మేనేజ్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని జిల్లా మినరల్ ఫండ్స్ కింద చేపట్టే పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఈ నెల 8వ తేదీన ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలెక్టరేట్‌లో గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ఉంటుందన్నారు. ఈలోపు ప్రతిపాదనలు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో గనుల శాఖ డీడీ వెంకటేశ్వర్లు, ఏడీ ఓబుళరెడ్డి, ఏసీ ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులు.. ముద్దాయికి ఏడాది జైలు

గార్లదిన్నె: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం అనంతపురం స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి జె.సుజిన్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా శుక్రవారం వెల్లడించారు. కల్లూరుకు చెందిన ప్రసాద్‌కు అదే గ్రామానికి చెందిన సుహాసినితో 2017లో పెద్దల సమక్షంలో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో భర్త ప్రసాద్, అత్త, మరిది కలసి అదనపు కట్నం తీసుకురావాలంటూ తనను వేధింపులకు గురి చేస్తున్నారంటూ 2019లో గార్లదిన్నె పోలీసులకు బాధితురాలు సుహాసిని ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం సెక్షన్ ఐపీసీ34, 498ఏ కింద అప్పటి ఎస్‌ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు వాదనలు అప్పటి నుంచి కొనసాగుతూ వచ్చాయి. సాక్షుల విచారణ అనంతరం అత్త, మరిది నిర్దోషులుగా తేలారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి ప్రసాద్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుజిన్‌కుమార్ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున వాదనలను పీపీ కె.శ్రీనివాసులు వినిపించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పోటీ పడాలి

- ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆలూరి సాంబశివారెడ్డి పిలుపు

బుక్కరాయసముద్రం: శరవేగంగా పరుగులు తీస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఇంజినీరింగ్ విద్యార్థులు పోటీ పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌ఆర్‌ఐటీ కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. సింఫనీ-2025 పేరుతో శుక్రవారం ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి హాజరయ్యారు. శ్రీనివాస రామానుజం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో ఇంజినీరింగ్ విద్యకు ఎంతో డిమాండ్ ఉందన్నారు. ప్రతి విద్యార్థికీ మంచి నైపుణ్యాలు కల్పించడంతో పాటు ఉద్యోగం కల్పించే దిశగా ఎస్‌ఆర్‌ఐటీ అధ్యాపక బృందం సాగిస్తున్న కృషిని కొనియాడారు. దేశ వ్యాప్తంగా ఐటీ దిగ్గజ కంపెనీల్లో తమ కళాశాల విద్యార్థులు వందలాది మంది ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అనంతరం కళాశాల వివిధ బ్రాంచ్‌లలో సీనియర్ ప్రొఫెసర్లకు అవార్డులు, మెమెంటోలు, కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు పతకాలను, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ఐక్యూఏసీ డైరెక్టర్ సాయి చైతన్య కిషోర్ వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



బహుమతులు అందజేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి చర్యలు

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్లినికల్ సైకాలజిస్టు, ఆడియాలజిస్టు, స్పీచ్ థెరపిస్టు, ఆప్టోమెట్రిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, లాస్ట్ గ్రేట్ సర్వీస్(క్లాస్4) ఉద్యోగాలను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. పూర్తి వివరాలకు https:// anantapuramu. ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించి, డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను భర్తీ చేసి ఈ నెల 10వ తేదీ లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలి.

కరెంటు పోలుపై నుంచి పడి యువకుడి మృతి

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామంలో ఓ యువకుడు కరెంటు పోలుపై నుంచి కింద పడి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు.. కందుకూరుకు చెందిన లక్ష్మీనారాయణ ఇంటికి విద్యుత్ పోల్ నుంచి అనుసంధానం చేసిన వైర్ లూజ్ కనెక్షన్ కారణంగా కరెంటు సరఫరాలో హెచ్చు తగ్గులు ఉంటూ వచ్చింది. ఇదే విషయాన్ని సమీపంలో ఉన్న పుట్టపర్తి లింగమయ్యకు (26) లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో శుక్రవారం సాయంత్రం లింగమయ్య కరెంటు పోలు ఎక్కి లక్ష్మీనారాయణ ఇంటికి సంబంధించిన సర్వీస్ వైర్ తాకగానే షాక్ కొట్టింది. దీంతో ఆయన కిందకు పడ్డాడు. తల నేరుగా వెళ్లి రాయిపై పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు.



లింగమయ్య (ఫైల్)

ఇంటిపై నుంచి కిందపడి వైద్యుడి మృతి

అనంతపురం: ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందపడి ఓ వైద్యుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న డాక్టర్ అమిలినేని మధు (49)కు భార్య డాక్టర్ సుష్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. దంపతులిద్దరూ దంత వైద్యులు కావడంతో నగరంలోని క్లాక్ టవర్ సమీపంలో ఓ ప్రైవేట్ క్లినిక్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఇంటిపైన నాలుగో అంతస్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించేందుకు డాక్టర్ అమిలినేని మధు వెళ్లాడు. గోడపైకి ఎక్కి వాటర్ ట్యాంక్ మూత తీసి పరిశీలిస్తుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి పై నుంచి కిందకు పడడంతో వెన్నుముక, కాళ్లు విరిగాయి. తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డాక్టర్ సుష్మ ఫిర్యాదు మేరకు అనంతపురం మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



అమిలినేని మధు (ఫైల్)

పచ్చిరొట్టతో లాభాలెన్నో..

- అధిక పోషకాలు సమకూరి భూమి సారవంతం
- రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది
- పెట్టుబడి తగ్గి పెరగనున్న దిగుబడి
- సబ్సిడీపై రైతులకు అందుబాటులో విత్తనాలు


సాగు చేసిన జీలుగ (ఫైల్)

ఆత్మకూరు: తక్కువ సారవంతమైన భూముల్లో నల్లటి మట్టిని వేస్తే మంచి దిగుబడులు వస్తాయి. అయితే ఇది అత్యంత ఖర్చుతో కూడుకున్నది. మట్టిని వేసే బదులు నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట ఎరువుల సాయంతో భూమిని సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జీలుగ సాగు చక్కటి ఫలితాలను ఇస్తోందని అంటున్నారు. జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, అవసంద వంటి పైర్లను పూ మొగ్గ దశ వరకు పెంచి భూమిలో కలియ దున్నడాన్ని పచ్చి రొట్ట ఎరువుగా పరిగణిస్తారు. పశువుల పేడ కంటే పచ్చిరొట్ట భూమిని పది రెట్లు ఎక్కువ సారవంతం చేస్తుంది. పచ్చిరొట్ట విత్తనాల కింద జీలుగ (ధనించా), జనుము (సన్‌హెంప్), పిల్లిపెసర ద్వారా భూసారం పెంచుకునేందుకు వీలుగా పొలాల్లో చల్లి పూతకు వచ్చిన తర్వాత కలియదున్నితే సేంద్రియ పదార్థం బాగా పెరుగుతుంది. ఇటీవల ఈ విత్తనాలకు రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో వీటి ధరలు, రాయితీలు ఖరారు చేశారు. జిల్లాకు ఈ ఏడాది 190 క్వింటాళ్ల జీలుగ, రెండు క్వింటాళ్ల జనుము, 15 క్వింటాళ్ల పిల్లిపెసర... మొత్తం 207 క్వింటాళ్లు కేటాయించారు. రబీలో కూడా జనుము, జీలుగ విత్తనాలు 425 క్వింటాళ్లు కేటాయించారు. జీలుగ విత్తనాలు క్వింటా పూర్తి ధర రూ.12,300 కాగా, 50 శాతం రాయితీతో రూ.6,150 చొప్పున రైతులకు అందజేయనున్నారు. అలాగే క్వింటా జనుము విత్తనాల పూర్తి ధర రూ.10,900 కాగా, 50 శాతం రాయితీ పోను రూ.5,450 చెల్లించాలి. పిల్లిపెసర క్వింటా పూర్తి ధర రూ.18 వేలు కాగా, 50 శాతం రాయితీ పోను రూ.9 వేల చొప్పున రైతులకు విక్రయిస్తారు. అవసరమైన రైతులు ఆర్‌ఎస్‌కేల్లో తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

లాభాలు..

- పొలంలో జీలుగను కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- మొక్కలకు రెండు శాతం నత్రజని, సూపర్ పాస్ఫేట్‌ను అదనంగా అందుతుంది.
- జింక్ మాంగనీస్, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మధాతువులను పంటకు చేకూరుస్తాయి. నేలలో కరుగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయి.
- నీటి నిల్వ సామర్థ్యం పెంచుతాయి.
- వానపాముల ఉత్పత్తికి దోహదపడుతాయి.
- లెగుమినసీ జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది.
- నేల భౌతిక స్థితి మెరుగుపడి భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుంది.
- నేలలో సేంద్రియ పదార్థం వేయడం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- జీవ రసాయన చర్యల వల్ల నేల సారం పెరగడమే కాక నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకుని ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.
- నేలలో క్లిష్ట (లభ్యం కాని) రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి.
- భూమిలో రసాయ ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగపడుతాయి.
- కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చు.
- భాస్వరం, గంధకం, వంటి పోషకాల లభ్యత గణనీయంగా ఉంటుంది.
- సూక్ష్మపోషకాలను పంట మొక్కలకు అందేలా చేస్తాయి.
- పచ్చి రొట్ట పైర్లు ఎరువులుగా కాకుండా పశువుల మేతగా కూడా ఉపయోగపడుతాయి.

సాగులో పాటించాల్సిన మెలకువలు

- పంట కోయగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగం చేసుకుని పచ్చిరొట్ట ఎరువులు విత్తుకోవాలి.
- తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే విత్తుకోవాలి.
- నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభాదాయకం.
- పసుపు, కంది, పంటల వరుసల మధ్య పచ్చిరొట్ట పెంచి పూత సమయంలో కలియదున్నాలి.
- రెండు పంటల మధ్య కాలవ్యవధిలో విత్తుకొని కలియదున్నుకోవచ్చు.

ఆర్‌ఎస్‌కేల్లో దరఖాస్తు చేసుకోవాలి



పచ్చిరొట్ట ఎరువును అందించే పచ్చిరొట్ట పైర్ల పెంపకం చాలా సులభమే. తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలను అందించవచ్చు. పచ్చిరొట్ట సాగులో జీలుగ, జనుము, ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇవి తక్కువ సమయంలో ఎక్కువ రొట్ట పెగుతాయి. భూమిలో కలియదున్నిన తరువాత త్వరగా చివికుతాయి. ఆకులలో ఎక్కువ నత్రజని శాతం కలిగి ఉంటాయి. పర్యావరణం దెబ్బ తినకుండా ఉంటుంది. రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుతుంది. సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి గల రైతులు ఆర్‌ఎస్‌కేల్లో దరఖాస్తు చేసుకోవాలి.

– సుచరిత, ఏఓ, ఆత్మకూరు

క్లుప్తంగా

ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే ఉజ్వల భవిత


క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులు

రాప్తాడు: విద్యార్థులే ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలని ఎస్‌వీఐటీ కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హంపాపురం సమీపంలోని శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్‌అండ్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇంగ్లిష్ భాషపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంగ్లిష్ భాష, గ్రామర్‌పై క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు వస్తుందని తెలిపారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాల కోసం వెళ్లినప్పుడు ఇంగ్లిష్ అంటే పూర్తిగా భయం పోతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, ఏఓ వెన్నపూస వెంకట శివారెడ్డి, ప్రిన్సిపల్ విష్ణువర్దన్, హెచ్ అండ్‌ఎస్ విభాగపతి మధుసూధన్ రెడ్డి, అయేషా తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర'పై ర్యాలీ



ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్వచ్ఛాంధ్ర కోసం అందరూ పాటుపడదామని ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి ఎం. విష్ణుప్రియ పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న 'నేషనల్ సర్వీస్ స్కీం స్పెషల్ క్యాంప్'లో భాగంగా 'స్వచ్ఛ ఆంధ్ర'పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుప్రియ మాట్లాడుతూ.. ప్రజలకు తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం విద్యార్థులతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి జి. ప్రిసిల్లా, రాశి, వలంటీర్ కే.మహేంద్ర, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సంతోష్ నాయక్, తిప్పేస్వామి, అభిషేక్ నాయక్ , మురళీకృష్ణ, హరిత, వెంకట సాయి పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సుకు తరలిరండి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నేతలు

ఆత్మకూరు: అనంతపురంలోని జిల్లా పరిషత్ హాల్‌లో ఈనెల 8వ తేదీన నిర్వహించే హార్టికల్చర్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మండల సీపీఐ కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పండ్ల తోటల పెంపకం అధికంగా ఉందని తెలిపారు. అయితే పండ్లను అమ్ముకునేందుకు దళారి వ్యవస్థతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సూచించారు. కోల్డు స్టోరేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈనెల 8వ తేదీన జరిగే సదస్సుకు రైతులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైఫల్యం విజయానికి సోపానం

అనంతపురం: వైఫల్యం విజయానికి సోపానం అని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగంలో రెండు రోజుల పాటు ఈవైఈ(ఐ)2కే–25 జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభించి విద్యార్థుల వినూత్న ఆలోచనలకు వేదిక కల్పిస్తామన్నారు. విద్యార్థులు సమాజంలో ఎదగడానికి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని వెల్లడించారు. ఇలాంటి జాతీయ సదస్సుల వల్ల విద్యార్థుల మేథోశక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ నష్టాలు పూర్తిగా తగ్గించే విదంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చెన్నారెడ్డి, కన్వీనర్, జేఎన్‌టీయూ అనంతపురం పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్, మాజీ రిజిస్ట్రార్, ఆర్జేయూకేటీ వీసీ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ప్రొఫెసర్ పి.సుజాత, డాక్టర్ జితేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు


మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో కాగజ్‌ఘర్ రిజ్వాన్, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన టీడీపీ, జనసేన పార్టీలకు రాబోవు రోజుల్లో ముస్లింలు బుద్ధి చెబుతారని మేయర్ వసీం అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ముస్లిం మైనార్టీ నేతలతో కలసి విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బిల్లు ఆమోదాన్ని ఖండించారు. వక్ఫ్ బోర్డులకు ఉన్న ఆస్తులు తమ పూర్వీకుల కష్టార్జితంగా సంపాదించుకుని దానంగా ఇచ్చారన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లును చాలా రాష్ట్రాలు వ్యతిరేకించాయని.. ఏపీలో మాత్రం టీడీపీ మాత్రం సవరణ చేయాలని చెప్పినట్లు ప్రచారం చేసుకుంటోందన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సిగ్గు లేకుండా మౌనంగా ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో తప్పక బుద్ధి చెబుతామన్నారు. మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నియాజ్, కార్యదర్శి వేముల నదీం, జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ మాట్లాడుతూ.. మహానేత వైఎస్సార్ కుటుంబం ముస్లిం పెద్దపీట వేసిందన్నారు. వక్ఫ్ బిల్లు ద్వారా మైనార్టీలకు జరిగే నష్టంపై టీడీపీలోని ముస్లిం మైనార్టీలు నోరు విప్పాలన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, కో–ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు మన్సూర్, కొర్రపాడు హుస్సేన్ పీరా, ఆసిఫ్, దాదు, రియాజ్, జావిద్, ఇసాక్, రఫీ, కమర్ తాజ్ పాల్గొన్నారు.

ముస్లింలను మోసం చేయడం దుర్మార్గం


వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ముస్లింలు


చాందిని మసీదు సమీపంలో ఫ్లై ఓవర్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

అనంతపురం కల్చరల్: ముస్లింలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడం విచారకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం నగరంలోని అన్ని మసీదుల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇమామ్‌లు, ముతవల్లీలు, యుజేఏసీ (యునైటెడ్ జాయింగ్ యాక్షన్ కమిటీ)కి చెందిన నాయకులు వేర్వేరు ప్రాంతాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులను ప్రదర్శించారు. స్థానిక చాందినీ మసీదు వద్ద మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, కార్పొరేటర్ ఇషాక్, స్థానిక ఖాజా నగర్‌లోని ఆల్ హబీబ్ మీస్జిద్ వద్ద వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడారు. ఎన్నికల సమయంలో ముస్లింలకు అండగా ఉంటామని చెప్పిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిస్సిగ్గుగా స్వార్థపూరిత ఆలోచనలతో బిల్లుకు మద్దతు ఇవ్వడం మైనార్టీలను మోసం చేయడమేనని మండిపడ్డారు. వక్ఫ్‌బోర్డు భూములంటే స్వచ్ఛందంగా దానధర్మమిచ్చినవని.. వెనక్కు లాక్కొనే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు.

అనంతపురం అర్బన్: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగర పరిధిలోని ప్రధాన మసీదుల వద్ద ముస్లింలకు కరపత్రాలను పంపిణీ చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య, సభ్యులు ఎన్‌టీఆర్ శీన, బుల్లెరాజు వెంకటేష్, బాలకృష్ణ, ఓబులేసు, రామాంజి, ఫక్ర ఇస్మాయిల్, తులసి, సునీత పాల్గొన్నారు.

రోజు కూలి రూ.700 ఇవ్వాలి


పాదయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలి. రోజుకు కూలి రూ.700 చెల్లించాలి. 200 రోజుల పని దినాలు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి డిమాండ్ల సాధనకు ఈనెల 22, 23 తేదీల్లో బండ్లపల్లి నుంచి అనంతపురం వరకూ పాదయాత్ర చేపడుతామన్నారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. శుక్రవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలకు 100 రోజుల పనులు కల్పించే లక్ష్యంతో ఉపాధి చట్టాని 2005లో తీసుకొచ్చారన్నారు. నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు. పేదల జీవితాల్లో కొంత మేర ఆర్థిక వెసలుబాటు కల్పించే ఈ చట్టాన్ని ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టానికి బడ్జెట్‌లో రూ.4.60 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా.. ఏటా తగ్గిస్తూ వస్తూ ఈ ఏడాది రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. అరకొర కేటాయింపులతో ఉపాధి కూలీలకు పనులు కల్పించేందుకు డబ్బులు సరిపోవన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, అధ్యక్షుడు రంగయ్య, వర్కింగ్ ప్రసిడెంట్ నాగరాజు, నాయకులు పెద్దయ్య, సంగప్ప, శివనారాయణమ్మ, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో ఈనెల 3వ తేదీన కురిసిన వర్షంతో మామిడి, అరటి, తదితర పండ్ల తోటలు, వరి, కాయగూరలు, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు పూర్తి దెబ్బతిన్నాయి. రైతులకు అపార నష్టం వాటిల్లిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిరుతల మల్లికార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, పండ్ల తోటలకు ఎకరాకు రూ.లక్ష పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

7న వాహనాల వేలం

రాప్తాడు: వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 7వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు సీఐ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా పలు కేసుల్లో పట్టుబడిన 8 ద్విచక్ర వాహనాలను మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో ద్విచక్ర వాహనాలను కొన్నవారు వాహనాలను గుజిరికి మాత్రమే వేస్తుకోవాలన్నారు. వాటిని ఎటువంటి పరిస్థితుల్లో వినియోగించకుడదన్నారు. అలా కాదని వాటిని ఎవరైనా వినియోగిస్తే అటువంటి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రేపు బైక్ ర్యాలీ

అనంతపురం కల్చరల్: ఈనెల 6వ తేదీన శ్రీరామ నవమి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నుంచి నగరవీధుల్లో హిందూ ఐక్యతను చాటుతూ బైక్ ర్యాలీ జరుగుతుందని ఉత్సవ కమిటీ కన్వీనర్ దూపకుంట్ల శబరి తెలిపారు. శుక్రవారం వీహెచ్‌పీ కార్యాలయలో శ్రీరామనవమి మహోత్సవ రథయాత్ర ఆహ్వాన పత్రికలు, బైక్ ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. భారీ ఎత్తున సాగే బైర్ ర్యాలీలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కో–కన్వీనర్లు గల్లా హర్ష, లోకేపల్లి విశ్వనాథరెడ్డి, హితేన్‌జైన్, శ్రీనివాసులు, అజేష్, నరేంద్ర, కిషోర్, మల్లికార్జున, సూర్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించరా?



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యా రంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బందెల నాసర్ జి మండిపడ్డారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తామని విద్యార్థులను తల్లిదండ్రులను నమ్మించి ఓట్లు వేయించుకున్నారన్నారు. గద్దెనెక్కిన తర్వాత పట్టించుకోలేన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.3,580 కోట్ల ఫీజు బకాయిలు ఉంటే కేవలం రూ. 788 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఓవైపు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశాం.. సర్టిఫికెట్లు ఎవరివి నిలబెట్టకండి అని విద్యాశాఖ మంత్రి చెపుతున్నా కళాశాలల యాజమాన్యాలు ఏమాత్రం లెక్కచేయకుండా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేసి పాత పద్ధతుల్లోనే యూనివర్సిటీ సెట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హనుమంత రాయుడు, కుళ్లాయిస్వామి, కోశాధికారి ఆంజనేయులు, నరసింహ, రాధాజ్యోతి, వెంకటనాయక్ పాల్గొన్నారు.

రూ.2.5 లక్షల నగదు చోరీ

అనంతపురం: బొలెరోలో ఉంచిన రూ.2.5 లక్షల నగదును దుండగులు చోరీ చేసిన ఘటన శుక్రవారం నగరంలో చోటుచేసుకుంది. వివరాలు.. రాప్తాడు మండలం వరిమడుగు గ్రామానికి చెందిన రైతు జయరాముడు నగరంలోని కృష్ణ థియేటర్ కాంప్లెక్స్‌లో ఉన్న కీర్తన ఫైనాన్స్‌లో గోల్డ్ లోన్ తీసుకున్నాడు. ధాన్యం అమ్మిన నగదు రూ.2.5 లక్షలు తీసుకుని గోల్డ్ లోన్ తీర్చేందుకు బొలెరో వాహనంలో అనంతపురం వచ్చాడు. కృష్ణ థియేటర్ కాంప్లెక్స్ పక్కన బొలెరో వాహనం పంక్చర్ కావడంతో రూ.2.5 లక్షల నగదు వాహనంలోనే ఉంచి.. టైరు మార్చే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో నగదును దొంగలు అపహరించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రైతు జయరాముడు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలం సమీపంలో సీసీ కెమెరాలు ఏమైనా ఉన్నాయా అని పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఎక్స్‌రే టెక్నీషియన్ల ఇష్టారాజ్యం


ఎక్స్ రే తీస్తున్న విద్యార్థిని

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోజు రోజుకు నాణ్యత ప్రమాణాలు దిగజారుతున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో రెగ్యులర్, కాంట్రాక్ట్ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రేడియోగ్రాఫర్లు, ఎక్స్‌రే టెక్నీషియన్ల బాధ్యతారాహిత్యం వెలుగు చూసింది. రోగి సమస్య నిర్ధారణలో ఎక్స్‌రే కీలకంగా పని చేస్తుంది. అటువంటి ఎక్స్‌రేలు తీసే విషయంలో కొందరు టెక్నీషియన్లు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎక్స్‌రే కోర్సు చేసేందుకు వచ్చిన విద్యార్థులకు అప్పగించేసి, ఆస్పత్రి వెనుక వైపు ఉన్న క్యాంటీన్‌లో మకాం వేస్తున్నారు. శుక్రవారం ఎక్స్‌రే రూం నెంబర్ 28, 29లో టెక్నీషియన్లు పత్తా లేకుండా పోయారు. ముగ్గురు విద్యార్థినులు ఎక్స్‌రేలు తీసే పరిస్థితి నెలకొంది. పదుల సంఖ్యలో రేడియో గ్రాఫర్లు, టెక్నీషియన్లున్నా.. విద్యార్థులకు అప్పగించి వెళ్లడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు వార్డులను పరిశీలిస్తే రోగులకు మేలు జరుగుతుంది.

ఉత్తమ నాటకాల ఎంపిక

అనంతపురం కల్చరల్: రాయలసీమ సంస్కృతీ సంప్రదాయాలకు దర్పణం పట్టేలా నిలిచిన నాటకాల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి, నగదు బహుమతులు అందజేస్తున్నట్లు రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. ప్రముఖ రచయిత, రాయలసీమ ఉద్యమనేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి స్మారకంగా నిర్వహించిన పోటీల విజేతలను ఆయన జయంతి నాడే వెల్లడించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. డాక్టర్ రాసాని (తిరుపతి) రచించిన 'దేవరమాన్యం' ప్రథమ బహుమతి, డాక్టర్ పామిరెడ్డి దామోదరరెడ్డి (అనంతపురం) రచించిన 'కొత్త సేద్యగాళ్లు' దత్తశర్మ (హైదరాబాద్) రచించిన 'నల్ల కాలర్' నాటకం సంయుక్తంగా ద్వితీయ బహుమతిని, శాంతి జయప్రకాష్ (హిందూపురం) రచించిన 'సమిధలు' గురువేపల్లి నరసింహులు (కళ్యాణదుర్గం) రచించిన 'పరివర్తన' నాటకాలు తృతీయ బహుమతిని దక్కించుకున్నాయని తెలిపారు. అలాగే ప్రత్యేక బహుమతుల విభాగంలో ఏలూరుకు చెందిన వెంకట నాగేంద్ర వేటకొడవలి, కర్నూలుకు చెందిన పర్వతయ్య 'చిన్నారి రేఖ', విశాఖపట్నానికి చెందిన పీవీ శేషారత్నం 'విజేత', చెన్నైకు చెందిన చతుర్వేదుల చెంచు సుబ్బయ్యశర్మ 'సఖ్యత' నాటకాలు ప్రాంత సమాజ స్థితిగతులను తెలిపేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపికలో సహకరించిన సీనియర్ సాహితీవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. విజేతలకు రూ.20 వేల నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను పోస్టులో పంపించడం జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు.

వైభవంగా కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ట


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని బృందావన కాలనీ, కళాకారుల కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కోదండ రామస్వామి విగ్రహాలతో పాటు మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామునే నూతన విగ్రహాలకు వేదపండితులు హోమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరై పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులు ఆదినారాయణ, బసవరాజు, ఓబుళపతి, శేఖర్, ఆనంద్, మల్లికార్జున, అశోక్, ఆంజనేయులు, చిరంజీవి తదితరులు భక్తులకు అన్ని వసతులు కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భారతీయ సంస్కృతిని చాటే 'మనగుడి'


ఉత్సవ నిర్వహణ సామగ్రి అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: శ్రీరామ నవమి సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 11 ఆలయాల్లో మనగుడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ బాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పలు ఆలయాలకు ఉత్సవ నిర్వహణకు రూ.3 వేల నగదు, భగవద్గీత పుస్తకాలు, శ్రీవారి పసుపు కుంకుమ, కంకణాలు అందజేశారు. భక్తులందరికి భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజమునీంద్ర స్వామి, సామాజిక సమరసత వేదిక సంయోజక్ నాగేశ్వరరెడ్డి, విజయ్‌తో పాటూ అర్చక బృందాలు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.